# 17

# శిష్యత్వపు మూల్యము

## (8:18-22)

అధ్యాయములు 8 మరియు 9లో మూడు జతల అద్భుతములు కలవు (8:1-17; 8:23-9:8; 9:18-34), అవి శిష్యత్వమును నొక్కి వక్కాణించుచున్న రెండు చర్చల చేత విభాగింపబడి యున్నవి (8:18-22; 9:9-17). మత్తయి 8:18-22లో శిష్యత్వమును గూర్చిన మొదటి సంభాషణ కలదు, అది యేసును వెంబడింపవలెనని ఆశించిన ఇద్దరిని గూర్చిన మంచి ప్రభావమును కనుపరచు వివరమై యున్నది. ఒకడు ఒక శిష్యుడుగా యేసును వెంబడించుటకు అవసరమై యున్న యోగ్యతలు ఈ చర్చ యొక్క ప్రధానాంశమై యున్నది. "వెంబడించుము" (*akoloutheō*) మరియు "వెళ్లుము" (*aperchomai*) అను కీలకమైన పదముల వాటి ప్రాధాన్యతను నొక్కిచెప్పుటకు పునరుక్తము గావింపబడినవి.

### ద్రవ్యము (8:18-20)

**18యేసు తన యొద్దనున్న జనసమూహమును చూచి అద్దరికి వెళ్ళవలెనని ఆజ్ఞాపించెను.**
**19అంతట ఒక శాస్త్రి వచ్చి-బోధకుడా నీ వెక్కడికి వెళ్ళినను నీ వెంట వచ్చెదనని ఆయనతో**
**చెప్పెను. 20అందుకు యేసు-నక్కలకు బొరియలును ఆకాశపక్షులకు నివాసములును కలవు**
**గాని మనుష్యకుమారునికి తలవాల్చుకొనుటకైనను స్థలములేదని అతనితో చెప్పెను.**

**వచనము 18.** యేసు, దైవికమైన దేవుని కుమారుడై యుండినప్పటికిని, ఆయన, తన తల్లి, మరియ ద్వారా, మానవ మనుష్య కుమారుడై కూడ యుండెను (8:20). ఈ విషయము యథార్థమైనదై యుండగా, ఆయన మానవ దౌర్బల్యము మరియు నిస్సత్తువకు గురియగుచుండెను. ఆయన కపెర్నహూములోనికి వచ్చినది మొదలకొని, రోగులై యుండిన జనసమూహము చేత ఆయన చుట్టుముట్టబడి యుండెను. తత్ఫలితంగా, ఆయన శారీరక మరియు మానసిక అలసటను అనుభవించుటకు ఆరంభించాడు. **యేసు** [గుమికూడి] **తన యొద్ద నున్న జనసమూహమును చూచి అద్దరికి వెళ్లవలెనని** [తన శిష్యులకు] **ఆజ్ఞాపించెను.** "అద్దరి" అను పదము, గలిలయ సముద్రము రెండు భాగములుగా, తూర్పు మరియు పడమర దిక్కున ఉండిన భాగములుగా, దృష్టింపబడినదని సూచించుచున్నది. యోర్దాను నది యొక్క ప్రవేశ స్థలము మరియు నిర్గమ స్థలమును జోడించుచుండిన ఊహాత్మకమైన నిలువు గీత చేత అది విభాగింపబడినది. ఒక మాదిరి రూపముగా అది సముద్రము యొక్క తూర్పు భాగమును సూచించును, అదే దెకపోలి ప్రాంతము. కపెర్నెహూము, గలిలయ సముద్రము యొక్క వాయవ్య మూలలో ఉండినది.

**వచనము 19.** ఆయనను అద్దరికి తీసికొనివెళ్లనై యుండిన ఆ చిన్న దోనె లోనికి ఆయన ప్రవేశింపక మునుపు, యేసునకు మరలా ఒకడు ఎదురు వచ్చాడు. **అంతట ఒక శాస్త్రి వచ్చి, బోధకుడా, నీవెక్కడికి వెళ్లినను నీ వెంట వచ్చెదనని ఆయనతో చెప్పెను.** ఒక

"శాస్త్రి" (*grammateus*) ఎంతో శ్రమించుచు పాత నిబంధన లేఖన భాగములను మరియు ప్రాముఖ్యమైన ఇతర దస్తావేజుల నకలు వ్రాయువాడై యుండెను. వారి ఉద్యోగ రీత్యా, ఈ శాస్త్రులు నిజంగానే పండితులయ్యారు. వారు ధర్మశాస్త్రోపదేశకులని వర్గీకరింపబడిరి, అయితే, పరిసయ్యులు అలా కాదు.

ఈ శాస్త్రి యేసును ఎదుర్కొనుటలో ప్రదర్శించిన చిత్తశుద్ధిని మనము తక్కువ అంచనా వేయుటకు హేతువేదియు లేదు. అట్లయినప్పటికిని, అతడు యేసును, "బోధకుడా" (*didaskalos*) అని మర్యాదపూర్వకంగా సంబోధించుచున్నాడు. ఒక శాస్త్రియైయున్నవాడు యేసును ఇటువంటి బిరుదుతో సంబోధించుటయే గమనార్హమైన విషయమై యున్నది. ఏదిఏమైనా, అసంఖ్యాకమైన ప్రజలు – యేసు విరోధులతో సహా – ఆయనను ఈ విధంగానే సంబోధించారు (12:38; 19:16; 22:16, 24, 36).

**వచనము 20. నక్కలకు బొరియలును ఆకాశపక్షులకు నివాసములను కలవు, గాని మనుష్యకుమారునికి తలవాల్చుటకైనను స్థలము లేదని** అతనికి ప్రత్యుత్తరమిచ్చుచు యేసు ఆ శాస్త్రి యొక్క దృఢసంకల్పమును పరీక్షించాడు. మరొక పర్యాయము, తన సందేశము సులభంగా అర్థమగునట్లు చేయుటకు ఆయన ప్రకృతిని ("నక్కలు" మరియు "ఆకాశపక్షులు") ప్రయోగించాడు (6:26, 28 చూడు). యేసు ఇచ్చిన సమాధానము "ఎక్కువగా ఈ సందర్భమునకు అనుకూలించుకొనబడిన ఒక సామాన్య సామెతగా ధ్వనించుచున్నది."[1] ఆయన పరిచర్య "సౌలభ్యమగు సకల సౌకర్యములు గల ఒక శాస్త్రియ విధానము ననుసరించు సంస్థగా నెలకొల్పబడదని" యేసు చెప్పుచుండెనని మైఖేల్ జే. విల్కిన్స్ చిత్రీకరించాడు.[2]

ఆయన నివసించుటకు నిర్దిష్టమైన చోటు లేకుండినదను అవగాహన ప్రకారము యేసు నిజముగా ఒక నివాస స్థలము లేనివాడు లేక "ఇల్లు వాకిలి లేనివాడు" కాదు. ఆ సమయంలో ఆయన కపెర్నహూము నుండి, అనగా ఆయన బహిరంగముగా ప్రజా పరిచర్య చేయుచుండిన కాలమంత తన నివాస స్థలము యుండినట్లు అగుపించుచున్న పట్టణము నుండి బయలుదేరుటకు సిద్ధపడుచుండెను. ఆయన బేతనియాలో మరియ, మార్త మరియు లాజరు ఇంటిలో సమయము గడుపుచండెను (లూకా 10:38, 39; యోహాను 12:1–3), మరియు నిశ్చయముగా ఆయన అనేక ఇతర గృహములలోనికి కూడ స్వాగతింపబడినాడు (10:11 చూడు). ఇంత చెప్పినా, "ఇది నా ఇల్లు" అని చెప్పుకొనుటకు ఆయనకొక సొంత స్థలమంటూ లేకుండినది. యేసు, ప్రదేశములలో తిరిగెడు ప్రబోధకుడై యుండెను. ఒక సంచాలక సువార్తీకుడై యుండెను, ఒకే చోట స్థిరనివాసం ఏర్పరచుకొనినట్లుండక ఆయన ఎల్లప్పుడు ఒక చోట నుండి మరొక చోటికి పయనించుచునే యుండెను. ప్రాచీన కాలము నాటి ప్రవక్తల వలె, ఆయన తరుచుగా నక్షత్రాదులుండిన గగనతలమునే పైకప్పుగాను, ఏదైన ఒక రాయిని తలగడగాను చేసికొని నిద్రించియుండవచ్చును. ఆయన ధరించియుండిన వస్త్రములను మించిన సొంత వస్తువులేమీ ఆయన యొద్ద లేవు. ఎంతో ఉత్సాహంతో వచ్చిన శాస్త్రి యేసును వెంబడించుటకు ఎన్నుకొనక మునుపు, ఇవ్విధమైన జీవన శైలి గూర్చి యోచించవలసి యుండినది.

యేసు ఒక పట్టణము నుండి మరొక పట్టణమునకు పయనించుచుండగా, ఆయనను తరుచుగా తృణీకరించారు. ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదు (యోహాను

1:11) మరియు యూదయ కూడ అలానే చేసింది (యోహాను 5:18). గలిలయలోని ప్రజలు ఆయన వెంట వెళ్లుట మానివేసారు (యోహను 6:66), మరియు ఆయన తమ పట్టణమును విడిచి వెళ్లవలసినదని గదరేనీయులు ఆయనను వేడుకొన్నారు (8:34). ఆయన బసచేయుటను సమరయుల గ్రామము నిరాకరించినది (లూకా 9:52, 53). లోకము సహితము ఆయనను తృణికరించినది (27:23).

"మనుష్యకుమారుడు" అను మాట ప్రభువే తనను గూర్చి వర్ణించుకొనిన సందర్భములలో అతి తరుచుగా ఉపయోగించాడు. ఆయన తన సార్థక నామమును క్రొత్త నిబంధనలో ప్రయోగించిన 88 పర్యాయములలో మత్తయి 8:20లోని సందర్భము మొట్టమొదటిదై యున్నది. "మనుష్యకుమారుడు" అనునది మెస్సీయ సంబంధమైన ఒక బిరుదుగా ప్రయోగింపబడినదని స్పష్టమగుచుండగా (దానియేలు 7:13, 14 చూడు), యేసును మానవజాతితో అత్యంత సన్నిహితముగా జోడించునది ఈ సార్థకనామమై యున్నది.[3] ఒక గొప్ప వినమ్రత చర్యగా, రాజులకు రాజైనవాడు మరియు ప్రభువులకు ప్రభువైనవాడు ఇహలోక లాభము విషయములో తనను తాను సంపూర్తిగా రిక్తునిగా చేసికొన్నాడు గనుక ఆయన మానవుల మధ్య ఒక బిచ్చగాని వలె జీవించాడు (ఫిలిప్పీయులకు 2:5–8 చూడు).

## కుటుంబము (8:21, 22)

**21శిష్యులలో మరియొకడు–ప్రభువా, నేను మొదట వెళ్ళి, నా తండ్రిని పాతిపెట్టుటకు నాకు సెలవిమ్మని ఆయనను అడుగగా. 22యేసు అతని చూచి–నన్ను వెంబడించుము; మృతులు తమ మృతులను పాతి పెట్టుకొననిమ్మని చెప్పెను.**

**వచనము 21**. ఆయన యొద్ద విచారణ చేయుటకు వచ్చిన రెండవ వాని గూర్చి శిష్యులలో మరియొకడు అని వ్రాయబడియున్న వర్ణన, ఇతడు మరియు ఇతని కంటె ముందుగా వచ్చిన శాస్త్రి యేసు క్రీస్తు శిష్యులై యుండిరి లేదా శిష్యులయ్యారను ధ్వనింపు నిచ్చుచున్నది. ఇతడు పన్నెండు మంది శిష్యులలో ఒకడని నమ్ముట చాలా దూరపుటాలోచన యగును, ఏలయనగా "శిష్యుడు" (*mathētēs*) అను పదము ఇచ్చట ఒక విశాలమైన దృష్టికోణములో వాడబడి యుండుట ఎక్కువ సంభావ్యమైనదిగా నున్నది. ఈ హోదా పన్నెండు మంది శిష్యుల విషయములో ప్రయోగింపబడదగినదై యుండగా, అతి తరుచుగా అది "నేర్చుకొనువాడు" లేక "విద్యార్థి" అను ఒక సాధారణ అవగాహనను కలిగించుచున్నది. గనుక ఆధ్యాత్మిక సహజార్థం దీనికి లేదు. అది ఏ విధమైన "అనుచరుడు"ను, వాడు పైపై చూపులకే వెంబడించువాడైనా, లేక నిజముగా నిబద్ధతగలవాడైనా, ఎవరినైనా సూచింపవచ్చును.

ఈ సందర్భములోనే, యేసు వానికిచ్చిన పిలుపును లూకా చేర్చాడు: "నా వెంట రమ్ము" (లూకా 9:59; మత్తయి 8:22 చూడు). అతడు, సన్నిహితముగా నుండు ఒక శిష్యుని వలె, గలిలయ సముద్రమునకు ఆవల వైపు వెళ్లవలసి యుండిన ప్రయాణముతో వెంటనే మొదలుపెట్టుచు, ఆయనతో కూడ పయనించవలెనని యేసు కోరుచుండినట్లు అగుపించుచున్నది. అందుకతడు, **ప్రభువా, నేను మొదట వెళ్లి నా తండ్రిని పాతిపెట్టుటకు నాకు సెలవిమ్మని** అడిగాడు. ఈ ప్రతిస్పందన అతడు ఆ సమయంలో యేసును అత్యంత

సన్నిహితముగా వెంబడింపలేకపోవుటకు గల ఒక నెపమై యుండును. కనీసపక్షమున, అతడు నిజమైన శిష్యత్వము కంటె కుటుంబ విద్యుక్త కర్తవ్యములకు ప్రథమ స్థానమునిచ్చుచుండెను (10:37; లూకా 14:25, 26 చూడు).

ఇతని పరిస్థితి గూర్చిన నిక్కచ్చియైన వివరములు స్పష్టముగా లేవు, కానీ మూడు సాధ్యతలు తలెత్తుచున్నవి. మొదటిది, అతని తండ్రి రోగియై యుండవచ్చును లేక ఉండకపోవచ్చును, కానీ అతడు కేవలము తన తండ్రితో కూడ నుండుటకు ఒక అవకాశమిమ్మని అడుగుచుండెను. ఇంటి యొద్ద నిలచియుండి, వారి మరణ పర్యంతము వృద్ధులైన తమ తలిదండ్రుల పట్ల తగు శ్రద్ధ వహించుట కుమారుల విధియై యుండినది. ఇతడు ఉపయోగించిన పదజాలము “తండ్రి మరణించి, ఆ తదుపరి కుటుంబ స్వాస్థ్యము తోబుట్టువుల నడుమ పంచుకొనబడునంతవరకు కుటుంబ వ్యవహారములలో తన తండ్రికి సహాయము చేయాల్సిన బాధ్యత కుమారునిపై నున్నదని సూచించుటకు ఆసియా మరియు మధ్య తూర్పు ప్రాంతంలో ప్రయోగింపబడుచుండిన ఒక సర్వసాధారణమైన అలంకార భాషయై యున్నదని” జాన్ మెక్ ఆర్థర్ జూనియర్, సాధికారంతో చెప్పుచున్నాడు.[4] ఈ విధమైన భాష మధ్య తూర్పు ప్రాంతములో నేడు సహితము ప్రయోగింపబడుచున్నదని కూడ మెక్ఆర్థర్ చెప్పుచున్నాడు.

రెండవది, అతని తండ్రి వాస్తవంగానే మరణించియుండెను, గనుక అతడు వెళ్ళి తన తండ్రి అంత్యక్రియల గూర్చి తగిన ఏర్పాట్లు చేయవలెనని ఆశించాడు. ఇందుకుగాను ఎక్కువ సమయం అవసరం లేకుండినది, ఏలయనగా భౌతిక కాయములు అదే దినమున సమాధిచేయబడినవి (27:59, 60; అపొస్తలులకార్యములు 5:5, 6, 10). భూస్థాపన కార్యక్రమము తదుపరి ఒక వారము రోజుల విలాపముల నిర్వహింపబడినది (ఆదికాండము 50:10; 1 సమూయేలు 31:13). మనుస్సును కరిగించే ఇటువంటి మనవిని యేసు కాదనుట సందేహమే.

మూడవది, అతని తండ్రి కొంత సమయము క్రితమే మరణించి యుండును, గనుక భూస్థాపన కార్యక్రమములోని మొదటి భాగము పూర్తిచేయబడి యుండును. భౌతిక కాయము బట్టలతో చుట్టబడి సమాధిలో ఉంచబడినది. ఏది ఏమైనా, సమాధిలో ఉంచబడు పెట్టె అని పిలువబడిన భూస్థాపన పెట్టెలో అస్థికలను ఉంచుటకు ఒక సంవత్సర కాలము గడిచిన పిదప కుమారుడు తిరిగి వెళ్లవలసి యుండినది.[5] అప్పుడు ఈ పెట్టె సమాధి వెనుక భాగమున నున్న గోడలోని గూటిలో ఉంచబడినది, తద్వారా భవిష్యత్తులో మరణించు తరువాతి కుటుంబ సభ్యుని పాతిపెట్టుటకు సమాధి ఖాళీ చేయబడినది. ఈ సందర్భములో, ఇతడు యేసును వెంబడించుటకు సంపూర్ణముగా సమర్పించుకొనక మునుపు తన చిట్టచివరి కర్తవ్యమును నెరవేర్చవలెనని ఆశించాడు.

మృతులను, ముఖ్యంగా మృతిచెందిన ఒకరి తలిదండ్రులను పాతిపెట్టుట, నిజముగా ఒక పవిత్రమైన కర్తవ్యమై యుండినది (ఆదికాండము 23:1-20; 25:7-10; 35:28, 29; 49:28-50:14). “నీ తండ్రిని నీ తల్లిని సన్మానించుము” అనునది ఇశ్రాయేలీయులకు ఇవ్వబడిన ఐదవ ఆజ్ఞయై యున్నది (నిర్గమకాండము 20:12; ద్వితీయోపదేశకాండము 5:16), గనుక ఒకడు తన తలిదండ్రులను సరియైన రీతిలో పాతిపెట్టవలెనని ఇది నిస్సందేహముగా ధ్వనింపు నిచ్చుచున్నది. ఒకడు శేమను (Shema) అనుదినము

వల్లించుట లేక రక్షరేకులు ధరించుట కంటే వాని తలిదండ్రులను పాతిపెట్టుటయే ఎంతో ముఖ్యమైన విషయమై యున్నదని యూదా మత బోధకులు ఉపదేశించారు.[6] మత్తయి వ్రాసిన సువార్తలోని తరువాతి నివేదికలో, ఒకడు తన తలిదండ్రులను సన్మానింపవలెనని దేవుడిచ్చిన ఆజ్ఞను యేసు గట్టిగా సమర్థించాడు (15:1–9). అట్లయినప్పటికిని, యేసును వెంబడించుట అన్ని విషయముల కంటె అగ్రస్థానములో ఉండవలెను.

**వచనము 22.** యేసు అతని చూచి, "నన్ను వెంబడించుము, మృతులు తమ మృతులను పాతిపెట్టుకొననిమ్మని" చెప్పెను. యేసు ప్రదర్శించిన ప్రతిస్పందన ఒక "లోకప్రసిద్ధమైన అలంకార సాహిత్యమై" యుండి, నియమ ప్రకారము అంగీకరింపబడకపోయినప్పటికిని, "లోకము దాని లౌకిక విషయాల గూర్చి చింతించనిమ్మని" ఆచరణాత్మకమైన అర్థమిచ్చుచుండినది.[7] ఆధ్యాత్మికముగా మృతిచెందినవారు భౌతికముగా మరణించినవారు అప్పుడే మృతిచెందినవారిని పాతిపెట్టుదురు. దీనంతటితో నిమిత్తము లేకుండా, నిత్య జీవము అత్యావశ్యకమై యున్నవారికి రాజ్య సందేశమును ప్రచురించవలెనను అంత కంటె గొప్పవైన ఆధ్యాత్మిక చింతలకు అతడు తనను తాను ఒప్పగించుకొనవలెనని యేసు పిలుపు నిచ్చుచుండను.

విచారణకై వచ్చిన మూడవ వ్యక్తి నొద్దకు వచ్చి, "ప్రభువా, నీ వెంట వచ్చెదను; గాని నా యింట నున్న వారి యొద్ద సెలవు తీసుకొని వచ్చుటకు మొదట నాకు సెలవిమ్మని" అడిగాడని లూకా అదనంగా చేర్చాడు (లూకా 9:61). ఈ సన్నివేశము గత విషయాలను అనగా, ప్రవక్తయిన ఏలీయా ఎలీషాకు ఇచ్చిన పిలుపును జ్ఞప్తికి తెచ్చుచున్న విషయమై యున్నది. ప్రవక్తయిన ఏలీయాను వెంబడింపక మునుపు, ఎలీషా తిరిగి తన ఇంటికి వెళ్ళి తన తలిదండ్రులకు వీడ్కోలు పలుకవలెనని ఆశించాడు, గనుక ఏలీయా అతనికి అనుమతినిచ్చాడు (1 రాజులు 19:19–21). ఏదిఏమైనా, శిష్యత్వ యోగ్యతల విషయములో ఏలీయా కంటే యేసే ఎక్కువ సాధికారముతో కోరుచున్నవాడై యున్నాడు. యేసు, "నాగటి మీద చెయ్యి పెట్టి, వెనుకతట్టు చూచువాడెవడును, దేవుని రాజ్యమునకు పాత్రుడుకాడని" వానితో చెప్పెను (లూకా 9:62). యేసు యొక్క యథార్థమైన శిష్యుడైయుండుటకు సంపూర్ణ సమర్పణ అవశ్యకమై యున్నది. శిష్యత్వ యోగ్యతల ప్రమాణమును లేశమాత్రమైనను తగ్గించుటకు యేసు ఏ మాత్రమును ఇష్టపడలేదు.

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

## యేసు యొక్క మానవత్వము (8:20)

"మనుష్యకుమారుడు," యేసు చేత అతి తరుచుగా వాడబడిన బిరుదై యున్నది. "దేవుని కుమారుడు" అను బిరుదును తనకై తానే వర్ణింపజేసుకొనుటను ఎన్నుకొనుటకు ఆయనకు సకల హక్కులుండినవి, కానీ ఆయన "మనుష్యకుమారుడు" అను దానినే అత్యధికంగా ఇష్టపడ్డాడు. యేసు తనను గూర్చి ఒక ప్రాముఖ్యమైన ప్రకటన చేయుచుండెనని ఇది ధ్వనింపునిచ్చుచున్నట్టు అగుపించుచున్నది. ఒక ప్రక్క అది ఆయన యొక్క సంపూర్ణ మానవత్వమును ఉద్ఘాటించి తెలియజెప్పుచున్నది. మరొక ప్రక్క అది ఆయన యొక్క విమోచనాత్మకము మరియు అధికారసహితమైన బృహత్కార్యభారమును

నొక్కివక్కాణించుచున్నది. ఆయన మానవులమైన మనతో ముడిపెట్టుకొని మనలను ఆయనతో గల సన్నిహిత సంబంధములోనికి చేర్చుకొనుటకు దేవుడు నరరూపి అయ్యాడు. "మనుష్య కుమారుడు" అనే బిరుదు యెహెజ్కేలు పుస్తకమంతట కనిపిస్తుంది, అది మానవత్వాన్ని నొక్కి చెప్పింది.

---

సూచనలు

[1]Robert H. Mounce, *Matthew*, New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 77. [2]Michael J. Wilkins, "Matthew," in *Zondervan Illustrated Bible Backgrounds Commentary*, vol. 1, *Matthew, Mark, Luke*, ed. Clinton E. Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 59. [3]"మనుష్య కుమారుడు" అనే బిరుదు యెహెజ్కేలు పుస్తకమంతట కనిపిస్తుంది, అది ప్రవక్త యొక్క మానవత్వాన్ని నొక్కి చెప్పింది. [4]John MacArthur, Jr., *The MacArthur New Testament Commentary: Matthew 8-15* (Chicago: Moody Press, 1987), 24-25. [5]Mishnah *Sanhedrin* 6.6; *Pesahim* 8.8; *Moed Katan* 1.5.6 చూడు. [6]Mishnah *Berakoth* 3.1; Talmud *Berakoth* 31a. [7]MacArthur, 25.